క్లుప్తంగా

సాయిబాబా విగ్రహ పునఃప్రతిష్ఠ



మందిరంలో ప్రతిష్ఠించిన సాయి పాలరాతి విగ్రహం

ఆకివీడు: సద్గురువు సాయిబాబా పాలరాతి విగహాన్ని స్థానిక సంతపేటలో పంట కాలువకు చేర్చి నిర్మించిన మందిరంలో గురువారం పునఃప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గ రోతు విజయకుమార్ మాట్లాడుతూ దాతల సహాయారంతో సాయి మందిరాన్ని, పాలరాతి విగహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని నిరసన



అజ్జమూరులో డ్రెయిన్ నిర్మించాలని నిరసన వ్యక్తంచేస్తున్న మహిళలు

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో డ్రెయినేజీ నిర్మించాలని ప్రధాన రహదారి ప్రాంత మహిళలు గురువారం సచివాలయం వద్ద ఆందోళన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరయిన నిధులతో చేపట్టే డ్రెయినేజీ నిర్మాణానికి కొందరు వ్యతిరేకించడంతో పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని మహిళలు కోరారు. ఎంపీడీఓ కందుల వాణి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, ఎస్సై నాగబాబు త్వరలోనే డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సాయుధ దళాల జెండా దినోత్సవం



భీమవరంలో డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల సీనియర్ డివిజన్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో గురువారం సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో భారీ జన చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ దేశాన్ని రక్షిస్తున్న సైనికుల సేవలు మరువలేనివన్నారు. యుద్ధంలో గాయపడి ఉద్యోగాలు కోల్పోయిన, మరణించిన వారి కుటుంబాలకు సైనిక సంక్షేమ నిధి ద్వారా సహాయం అందుతుందన్నారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు సైనిక నిధికి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి, పి.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ.వీరయ్య, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌జే సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



కేవీకేలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ వాణీ విజయరత్నకుమారి

ఉండి: తల్లి లేదా తండ్రి గల్ఫ్‌దేశాలు వేళ్తే మిగిలిన వారు వారి పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వాణీ విజయరత్నకుమారి అన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని, వీటిని అడ్డుకునేందుకు 1098 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆడపిల్లలపై లైంగిక దాడికి పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆడపిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బేటీ బచావో, బేటీ పడావో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా తమను తాము రక్షించుకునేలా ఆడపిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లల్ని బాగా చదివిస్తే అభివృద్ధిలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దెబోరామెస్సియానా, న్యాయవాది జి.సుందర్ కుమార్, సూపర్‌వైజర్ మేరీ, నిర్మల, నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గల్ఫ్ దేశాలు వెళ్లినవారి పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



భీమవరం(ప్రకాశం చౌక్): 15వ వార్డులో జెండా ఆవిష్కరణ



భీమవరం అర్బన్ : లోసరిలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ



ఉండి : ఉప్పులూరులో పథకాల డిజిటల్ బోర్డు ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన నూటికి నూరు శాతం అందించారని వైఎస్సార్ సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య అన్నారు. గురువారం స్థానిక 15వ వార్డులో వార్డు ఇన్‌చార్జి మద్దుల కరుణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తొలుత నాయకులు వార్డులో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. సీఎం జగన్ పేదల సంక్షేమానికి రూ.లక్షల కోట్లు ఖర్చు చేశారని ఉమాబాల, భోగయ్య తెలిపారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ సీఎం జగన్ సహకారంతో భీమవరం పట్టణంలో రోడ్లు, డ్రెయిన్లు, తాడేరు వంతెన నిర్మించడం, 100 పడకల ఆస్పత్రి నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ రాజు, కోడే యుగంధర్, గంటా సుందర్ కుమార్, కందికట్ల ఎడ్వర్డ్, పాలపర్తి జోనా, మానేపల్లి నాగేశ్వరరావు, రేవూరి గోగురాజు, అల్లూరి నాగవల్లి, పాలవెల్లి మంగ, పెన్మాడ శ్రీను, కరీముల్లా బాషా, చెల్లబోయిన సూర్యప్రకాష్, ఇంటి సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సీఎం జగన్

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు రూపొందించి అమలు చేస్తూ రైతులకు అండగా ఉంటున్నారని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలం లోసరి గ్రామంలో గురువారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తోకతిప్ప, లోసరి గ్రామాలకు అమ్మఒడి, పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత తదితర పథకాల ద్వారా లబ్ధి రూ.22.80 కోట్లు చేకూరిందని విజయ నరసింహరాజు వివరించారు. తిరుమాని ఏడుకొండలు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, సర్పంచ్ రామాని శివాజీ వర్మ, తిరుమాని శ్రీను, ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు, గుద్దటి రాంబాబు, యాతం సాయి, పెచ్చెట్టి సుబ్బారావు, గంధం రమేష్, కేవీ సత్తిబాబు, ఒడుగు ముత్యాలరాజు, నామన మహేష్, కొట్టి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అండగా సీఎం జగన్

ఉండి: ప్రజలకు అన్నివిధాలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు అన్నారు. గురువారం మండలంలోని ఉప్పులూరు గ్రామంలో ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్ (బాలు) ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పథకాల డిజిట్ బోర్డును ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో గ్రామానికి డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.23.07 కోట్లు లబ్ధి చేకూరిందని ప్రజాప్రతినిధులు, నాయకులు వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కొంచాడ వెంకటేశ్వరరావు, ఏఎంసీ సభ్యుడు నిమ్మల సత్యనారాయణ, దేవస్థానం కమిటీ చైర్మన్ యర్రా వెంకటసుబ్బారావు, నిమ్మల శేషగిరిరావు, యర్రా రాంబాబు, మేడిశెట్టి సత్యనార్యాయణ, యర్రా చెన్నకేశవరావు, వర్రే పైడియ్య, బొచ్చా అచ్చారావు, దేవాబత్తుల పోలు, గ్రంధి నాని, ఉన్నమట్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణ చర్యలు



ఉండి : అక్విడెక్టు వద్ద తూడు తొలగిస్తున్న దృశ్యం



ఉండి : యండగండిలో యనమదుర్రు గట్టుపై వేసిన మట్టి బస్తాలు



కాళ్ల : పెద అమిరం కాలనీలో డ్రెయిన్ మురుగు పారుదలకు అడ్డంకులు తొలగిస్తున్న దృశ్యం

ఉండి: ముంపునకు గురైన వరి పొలాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. తహసీల్దార్, ఏఓ, ఇరిగేషన్ ఏఈలతో కూడిన త్రిసభ్య కమిటీ మండలంలోని ముంపు ప్రాంతాలను పరిశీలించింది. ఉండి అక్విడెక్టు వద్ద పేరుకుపోయిన తూడును పొక్లెయిన్ సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. దీంతో యండగండి, కోలమూరు, ఉప్పులూరు, పాందువ్వ, ఆరేడు, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, వాండ్రం తదితర గ్రామాల వరి పొలాల్లో ముంపునీరు బయటకు మళ్లే అవకాశం ఏర్పడింది. మండలంలో 2,200 ఎకరాల్లో వరి పంట నీట మునగడం, పడిపోవడం జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. రాబోయే రెండు మూడు రోజుల్లో వరిపొలాల్లో నుంచి నీరు పూర్తిగా బయటకు పంపిస్తే నష్టాన్ని అంచనా వేసే అవకావం ఉంటుందని వివరించారు. మండలంలో 10,790 ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా, ఇందులో 3054 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం సాయంత్రం వరకు వర్షం కురవకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ధన్యాన్ని ఆరబెట్టుకున్నారు. యండగండిలో యనమదుర్రు మేజర్ డ్రెయిన్ గట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో మట్టి బస్తాలను సిద్ధంగా ఉంచామని సర్పంచ్ చినకృష్ణమూర్తి తెలిపారు. భారీ వర్షాలకు యండగండి గ్రామం తీవ్రంగా ఇబ్బంది పడిందని, తమ గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాలైన ఉప్పులూరు, పాందువ్వ ఖండిక గ్రామాలకు కూడా ప్రమాదం పొంచి ఉండడంతో ప్రత్యేక శ్రద్ధతో గట్లను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

మురుగు నీరు మళ్లింపు

కాళ్ల: మండలంలోని పెదఅమిరం కాలనీ డ్రెయిన్‌లో వర్షం నీటి మళ్లింపు చర్యలు చేపట్టారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టు సర్పంచ్ డొక్కు సోమేశ్వరావు తెలిపారు. మురుగునీటిని మళ్లించి, దోమలు విజృంభించకుండా బ్లీచింగ్ చల్లిస్తున్నట్టు చెప్పారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

భీమవరం అర్బన్: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షం కారణంగా గ్రామాల్లో గురువారం పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. తీరప్రాంత గ్రామాలైన దొంగపిండి, తోకతిప్ప, కొత్తపూసలమర్రు, గొల్లవానితిప్ప, లోసరి, నాగిడిపాలెం, గూట్లపాడు, దెయ్యాలతిప్పలలో ఇళ్ల చుట్టూ నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్టు, పూడికను తీసి బ్లీచింగ్ చల్లారు. ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. పారిశుధ్య పనులను సర్పంచ్‌లు చిల్లే వెంకటేష్, ఒడుగు ముత్యాలరావు, జల్లా కొండయ్య, రామాని శివాజీ వర్మ, తిరుమాని శ్రీను, నాగిడి నారాయణస్వామి, వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవాని, కార్యదర్శులు పర్యవేక్షించారు.

వరి కంకుల్లో మొలకలు



పెదకాపవరంలో మొలకొత్తిన వరి కంకులు

ఆకివీడు: తుపాను వర్షాలతో మూడు రోజులుగా నీటిలో నానుతోన్న వరి కంకులు మొలకలు వస్తున్నాయి. ఈదురుగాలులు, వర్షానికి ఎంటీయూ 7029 స్వర్ణ వంగడం, సంపద స్వర్ణ, ఎంటీయూ1318 రకం వరి నేలకొరిగింది. చేలల్లో వర్షం నీరు నిల్వ ఉండడంతో వరి కంకులు సుమారు అంగుళం బారులో మొలకలు వచ్చాయి. 1318 రకం వంగడం సాధారణంగానే గింజ తయారైన రెండు, మూడు రోజులకే తడి తగిలితే మొలకొస్తుంది. మొలకలెత్తిన ధానాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మావుళ్లమ్మవారి దీక్ష విరమణ



దీక్ష విరమిస్తున్న మావుళ్లమ్మ మాలధారులు



మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాలకు పందిరి రాట పాతుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మవారి దీక్షామండలి మాలధారణ ఇరుముడి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మందిపైగా మాలధారులు ఇరుముడి సమర్పించుకున్నారు. భీమవరంతోపాటు అమలాపురం, తణుకు, నర్సాపురం ప్రాంతాల నుంచి మాలధారులు అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు. అమ్మవారికి నెయ్యాభిషేకం ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ చేశారు. సుమారు 1500 మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మ కర్తలు ముత్యాల వెంకట రామారావు, చెల్లంకి నాగ శేషగిరి (గిరి), మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, కోయ వెంకట లక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

● మావుళ్లమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు సందర్భంగా రాట ముహూర్తం నిర్వహించారు. నీరుల్లి కూరగాయల వర్తక సంఘం, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

యనమదుర్రు గట్ల పటిష్టతకు చర్యలు తీసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం: భారీవర్షాలు వల్ల యనమదుర్రు డ్రెయిన్ నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో గట్ల పటిష్టతకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్ అధికారులతో ఆయన సమీక్షించారు. తుఫాను ప్రభావం తగ్గినప్పటికీ ఎగువప్రాంతం నుంచి ఎర్రకాలువకు నీటి ఉధృతి పెరిగిందని, దీంతో యనమదుర్రు నీటిమట్టం 32.8 అడుగులకు చేరిందని తెలిపారు. పట్టణంలో ముంపు ప్రాంతాల్లో నీటిని బయటకు తోడేందుకు మోటర్లను ఏర్పాటు చేయాలని, యనమదుర్రు డ్రెయిన్‌కు అనుకుని ఉన్న స్లూయిజ్‌లకు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, షట్టర్లను నిత్యం పరిశీలించాలని ఆదేశించారు. పట్టణంతోపాటు భీమవరం మండలంలోని పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలూ కల్పించాలని అన్నారు. రైతులను ఆదుకోవడానికి సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వై.రవి కుమార్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ వినయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, అగ్రికల్చర్ ఏఓ నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలి

భీమవరం: తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలని రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీ రామరాజు కోరారు. రైతు కార్యాచరణ సమితి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం పంట నష్టాన్ని పరిశీలించినట్టు ఆయన తెలిపారు. తేమ శాతం పరిగణలోకి తీసుకోకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించడం రైతులకు కొంత ఊరటనిచ్చిందన్నారు.

కౌలు రైతుకూ పరిహారం ఇవ్వాలి

ఉండి: తుపాను వల్ల నష్టపోయిన కౌలు రైతులకు కూడా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఉండి ఏఎంసీలో రైతులు ఆరబోసుకున్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

రైతుల్ని ఆదుకోవాలి

ఆకివీడు : తుపాను బాధితుల్ని, రైతుల్ని తక్షణం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావానికి నష్టపోయిన ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు, భీమవరం తదితర మండలాల్లో పర్యటించినట్టు ఆయన గురువారం తెలిపారు. పంటల బీమా చెల్లింపునకు త్వరిత గతిని ప్రతిపాదనలు పంపాలని, ప్రధానమంత్రి ఫసల యోజన పథకం మంజూరుకు కృషి చేయాలన్నారు.

ట్రెక్కింగ్ క్యాంపునకు వైహెచ్‌ఏఐ బృందం



డల్హౌసీ ట్రెక్కింగ్ క్యాంపునకు భీమవరం నుంచి బయలుదేరిన వైహెచ్‌ఏఐ బృందం

భీమవరం: డల్హౌసీ ట్రెక్కింగ్ క్యాంపునకు భీమవరం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) సభ్యులు గురువారం బయలుదేశారు. డిసెంబర్ 9 నుంచి 31 వరకు ట్రెక్కింగ్ క్యాంపు కొనసాగుతుందని అసోసియేషన్ యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ తెలిపారు. 22 కిలోమీటర్ల మేర మంచులో నిర్వహించే ఈ ట్రెక్కింగ్‌కు జానపాటి మధుసూదనరావు, కటికిరెడ్డి వెంకటరత్నం నాయకత్వం వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ట్రెక్కింగ్ బృందానికి భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ వద్ద వైహెచ్‌ఏఐ రాష్ట్ర శాఖాధ్యక్షుడు డాక్టర్ సోమరాజు, బొండా శ్రీరామ్, కట్రెడ్డి సత్యనారాయణ, బోనం పాండురంగారావు తదితరులు వీడ్కోలు పలికారు.

20 నుంచి ఆందోళనలు

భీమవరం: కార్మికులకు, స్కీం వర్కర్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం కోరింది. గురువారం స్థానిక యూటీఎఫ్‌కార్యాలయంలో జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20 నుంచి జనవరి 8 వరకు దేశవ్యాప్తంగా అఖిలభారత పిలుపులో భాగంగా ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, పీవీ ప్రతాప్, కె. నాగేశ్వరరావు, డి.కళ్యాణి, కె.జాన్సీలక్ష్మి, ఎ.అజయ్ కుమారి, వెంకటేశ్వరరావు, జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాండ్రంలో వై ఏపీ నీడ్స్ జగన్

ఉండి: ఉండి మండలం వాండ్రం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 గంటలకు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బియ్యం పంపిణీ



ప్రకాష్‌నగర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: తుపాను కారణంగా ఉపాధి కోల్పోయిన పట్టణంలోని గొల్లవానితిప్పరోడ్డు, ప్రకాష్‌నగర్ కాలనీల్లో యానాదులకు హిందూబంధు ఆధ్వర్యంలో గురువారం బియ్యం పంపిణీ చేశారు. సుమారు 80 కుటుంబాలకు ఐదు కిలోల చొప్పున బియ్యం అందజేశామని ఆర్ఎస్ఎస్ ఉభయ గోదావరి జిల్లాల సంచాలక్ మంతెన రామచంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో మజ్జి మహేష్, ఇళ్ల హరికృష్ణ, వనమ శ్రీకాంత్, కొప్పర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గరగపర్రు కేసు కొట్టివేత



హర్షం వ్యక్తం చేస్తున్న రాజేష్ తదితరులు

భీమవరం: పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు ఉద్యమంలో పెట్టిన కేసును గురువారం భీమవరం సెకండ్ అడిషనల్ కోర్టులో కొట్టివేసినట్టు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నల్లి రాజేష్, కొల్లపు వేణు తదితరులపై 2017లో కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కర్ని జోగయ్య, జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్‌బాబు, నాయకులు మోకా నర్సింహారావు, గాది రవి, విప్పర్తి నవీన్, వర్ధనపు మోషే తదితరులు కోర్టు వద్ద రాజేష్ తదితరులకు పూల మాలలు వేసి హర్షం వ్యక్తం చేశారు.

కంటైనర్ దగ్ధంపై కేసు

భీమవరం అర్బన్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో కంటైనర్ దగ్ధంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపూసలమర్రు గ్రామంలోని ఆనంద ఎంటర్ ప్రైజెస్ వద్ద గత నెల 26న షార్ట్ సర్క్యూట్‌తో కంటైనర్ దగ్ధమైనట్టు ఉద్దరాజు వెంకట రామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.

జూదరుల అరెస్ట్

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం గ్రామ పరిధిలో పేకాట శిబిరం నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు. రూ.4090 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

పాలకొల్లు అర్బన్: ద్వి చక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పాలకొల్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె సతీష్ చెప్పారు. యలమంచిలి మండలం చించినాడలో వాహనాలు తనిఖీ చేశారు. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గంజాయి, గుట్కా తదితర అలవాట్లు మానుకోవాలని చెప్పారు. గంజాయి అమ్మినా, లేదా అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సై కె శివన్నారాయణ, పోలీసులు ఉన్నారు.

నేడు గోదావరి హారతి

నరసాపురం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నరసాపురం పంటిరేవు అమరేశ్వర స్వామి ఆలయం వద్ద గోదావరిమాతకు హారతి ఇచ్చే కార్యక్రమాన్ని విశ్వహిందూపరిషత్ చేపట్టింది. రాత్రి 8 గంటలకు గోదావరికి హారతి, శనివారం ఉదయం స్వామీజీల ప్రవచనాలు ఉంటాయని విశ్వహిందూ పరిషత్ నాయకులు గురువారం విలేకరులకు తెలిపారు. అనేక మంది స్వామీజీలు, పీఠాధిపతులు ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారని గోదావరి పుట్టిన నాశిక్ నుంచి పాదయాత్రగా స్వామీజీలు వస్తున్నారని వివరించారు.